www.SHUBODHAYA DYNAMIC VAARTA.com
శుభోదయ డైనమిక్ వార్త
ప్రజల కోసం - ప్రగతి కోసం
SHUBODHAYA DYNAMIC VAARTA

విలేకరులు కావలెను
తెలుగు రాష్ట్రాలలో వెలువడుతున్న
డైనమిక్ దినపత్రికలో
అన్ని మండలాల వారీగా
విలేకరులు కావలెను.
డైనమిక్
CELL : 96523 03089

సూర్యాపేట | బుధవారం 29 జూలై 2026 | సంపుటి : 01 | సంచిక :01 | వెల : 3/- | ఎడిటర్ : పర్వతం పరమేష్

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు ముందు హైడ్రామా

- శాఖ మార్పునకు కేంద్రం ప్రతిపాదన
- ప్రచారాన్ని ఖండించిన బీజేపీ
- మొదట ధర్మేంద్ర ప్రధాన్ శాఖ మార్చేందుకు కేంద్రం సిద్ధమైందని సమాచారం
- రాజీనామా తప్ప మరో ప్రత్యామ్నాయం అంగీకరించబోమన్న సీజేపీ ప్రతినిధులు
- ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నమనే ఇది
- ప్రధాన్ మంత్రిత్వ శాఖ మారుస్తామన్న ప్రతిపాదనేదీ కేంద్రం చేయలేదు



## 'పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఎన్నికలు కపట నాటకం

- ఆక్రమణలు, దారుణాల్ని కప్పిపుచ్చే డ్రామా'
- పాకిస్థాన్‌పై భారత్ మరోసారి తీవ్ర ఆగ్రహం
- పీఓకేలో స్థానిక సంస్థల ఎన్నికలు అక్రమ ఆక్రమణల్ని దాచే ప్రయత్నమేనని విదేశాంగ శాఖ విమర్శలు
- జమ్మూకశ్మీర్, లద్దాఖ్ సహా పాక్ ఆక్రమించిన ప్రాంతాలు భారత్‌లో అంతర్భాగమేనని స్పష్టం



## రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ

# ఇబ్బందులు పడకూడదు




- సీడ్ కంపెనీలు గానీ, ఆర్గనైజర్లు గానీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులు పడకూడదు
- పెండింగ్‌లో ఉన్న బకాయిల చెల్లింపులను వెంటనే ప్రారంభించి రైతులకు సకాలంలో అందేలా కార్యాచరణ చేపట్టాలి
- రైతుల ప్రయోజనాలకు భంగం కలిగే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే సంబంధిత కంపెనీలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడానికైనా వెనుకాడబోదు



## ప్రహ్లాద్ జోషి రేపిస్టుల మద్దతుదారు

- ఆయనకు విద్యాశాఖ బాధ్యతలు కట్టబెట్టడం దారుణం
- దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బిల్కిస్ బానో కేసులో శిక్షపడిన దోషులను ప్రహ్లాద్ జోషి వెనకేసుకొచ్చారని రాహుల్ విమర్శ
- బీజేపీ ఒక అత్యాచార దోషుల రక్షకుడిని మంత్రి కుర్చీలో కూర్చోబెట్టింది.
- "అన్నింటికన్నా మనకు ఈ దేశ రాజ్యాంగం గొప్పది, ప్రజాస్వామ్యమే సర్వోన్నతమైనది
- దానిని నాశనం చేయడం పాపం
- ఈ దేశంలోని కోట్లాది ప్రజలు మనల్ని కోరుకునేది ఒక్కటే, అదే జవాబుదారీతనంల

## విద్యా హక్కులపై కేంద్రం ఆధిపత్యం

# సరికాదు

- ఒక అధికారిని ఎక్కడ నియమించాలన్నది 'మా విచక్షణాధికారం'
- దానిని ఎవరూ లాక్కోలేరు: ఢిల్లీలో మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ విషయంలో హైకోర్టు ఉత్తర్వులను సమీక్షించి చట్టబద్ధంగా ముందుకెళ్తాం
- కోర్టుల్లో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటాం
- కబ్జాదారులే కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారు
- దురుద్దేశపూర్వకంగా ధిక్కరణ కేసులు వేస్తున్నారు
- డబ్బులు ఖర్చు పెట్టి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారు
- మేము తీసుకువచ్చిన అతి పెద్ద సంస్కరణ హైడ్రా



**న్యూఢిల్లీ**

ఒక అధికారిని ఎక్కడ నియమించాలనేది ప్రభుత్వానికి ఉండే విచక్షణాధికారం. దానిని ఎవరూ లాక్కోలేరు. గతంలో సీఎస్‌గా పనిచేసిన సోమేశ్‌కుమార్‌పై 400 కంటెంప్ట్ కేసులు ఉన్నాయి. న్యాయస్థానాలపై మాకు సంపూర్ణ విశ్వాసం ఉంది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ విషయంలో హైకోర్టు ఉత్తర్వులను సమీక్షించి చట్టబద్ధంగా ముందుకు వెళ్తాం.. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన అత్యంత గొప్ప సంస్కరణ 'హైడ్రా' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. - మిగతా3లో



## ఏటా ఫీజు రీఎంబర్స్‌మెంట్

# చెల్లిస్తాం

- ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి
- యూనివర్సిటీలపై ఆధిపత్యం చలాయించాలని కేంద్రం యత్నిస్తోందని ఆరోపణ
- కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో ప్రక్షాళనపై యోచిస్తామని వెల్లడి
- గ్లోబరీనా వంటి సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి

**హైదరాబాద్**

ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ,, ఆఫ్‌లైన్‌లో పరీక్షల నిర్వహణ వల్ల సమస్యలు ఎక్కువ వస్తున్నాయని తెలిపారు. బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్? చేశారు. విద్యాశాఖలో రాష్ట్ర పరిధి అధికారాలను కేంద్రం లాక్కునే ప్రయత్నం చేస్తోందని, యూనివర్సిటీలపై ఆధిపత్యం చలాయించాలని కేంద్రం యత్నిస్తోందని ఆరోపించారు. విద్య, వీలైనంత వరకు రాష్ట్ర పరిధిలో ఉంటే తప్పిదాలు జరగకుండా ఉంటాయని తెలిపారు. కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో ప్రక్షాళనపై ఆలోచిస్తామని సీఎం తెలిపారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టామని, రాష్ట్రంలో పారదర్శకంగా పరీక్షలు నిర్వహించామని గుర్తు చేశారు. - మిగతా3లో



## బ్లాక్‌మెయిల్ కోసమే

# హైడ్రా

- రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్
- హైడ్రా కమిషనర్‌గా ఏవీ రంగనాథ్‌ను తొలగించాలన్న హైకోర్టు
- హైకోర్టు ఆదేశాలు రేవంత్ ప్రభుత్వానికి చెంపపెట్టు
- హైడ్రా పేరుతో ఆర్‌ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ఆరోపణ
- కాంగ్రెస్ నేతల నివాసాలను ఎందుకు కూల్చడం లేదని ప్రశ్న

**హైదరాబాద్**

హైడ్రా కమిషనర్‌ను తక్షణమే ఆ పదవి నుంచి తొలగించాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. ఈ పరిణామంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. హైడ్రాను కాంగ్రెస్ - మిగతా3లో

## జనసంద్రమైన సింహాచలం..

- వేడుకగా 32 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణ
- ప్రారంభమైన సింహాచలం గిరి ప్రదక్షిణ మహోత్సవం
- అప్పన్న నామస్మరణతో కిటకిటలాడుతున్న 32 కి.మీ. మార్గం
- 10 లక్షల మందికి పైగా పాల్గొంటారని అధికారుల అంచనా
- భక్తుల కోసం భారీ ఏర్పాట్లు.. డ్రోన్లతో పోలీసుల పర్యవేక్షణ
- స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం, మంచినీటి పంపిణీ



# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు ముందు హైడ్రామా

నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వివాదంతో ప్రారంభమైన ఆందోళనలు, చివరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీశాయి. అయితే మొదట ధర్మేంద్ర ప్రధాన్? రాజీనామాకు కంటే ముందు ఆయనను వేరే శాఖకు మార్చాలని ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ప్రశ్నపత్రాల లీకేజీలకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులతో జరిపిన తొలి చర్చల్లో కేంద్రం ధర్మేంద్ర ప్రధాన్? శాఖను మాత్రమే మార్చే ప్రతిపాదనను చేసిందని సమాచారం. అయితే ఆ ప్రతిపాదనను సీజేపీ ప్రతినిధులు పూర్తిగా తిరస్కరించినట్లు ప్రచారం జరిగింది. అయితే, ఈ వార్తలను బీజేపీ ఖండించింది. అవి పూర్తిగా నిరాధారమైనవని, కల్పితమైనవని పేర్కొంది.

ఈ అంశంపై బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర స్పందించారు. ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నమనే ఇదన్నారు. ప్రధాన్ మంత్రిత్వ శాఖ మారుస్తామన్న ప్రతిపాదనేదీ కేంద్రం చేయలేదని చెప్పారు. ఇవన్నీ నిరాధార కథనాలేనని కొట్టిపారేశారు. కేవలం సంచలనాల కోసం ఇలాంటి అసత్య వార్తలను వ్యాప్తి చేయవద్దని హితవు పలికారు.

దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సీజేపీ ఆధ్వర్యంలో నిరసనలు ఉధృతంగా కొనసాగుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం చర్చలకు ముందుకొచ్చింది. సీజేపీ ప్రతినిధులతో సమావేశమైన కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్? పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్?ను విద్యాశాఖ నుంచి మరో మంత్రిత్వ శాఖకు మార్చే అవకాశాన్ని ప్రభుత్వం ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. దీంతో విద్యార్థుల ఆందోళనలు తగ్గుతాయని



కేంద్రం భావించినట్లు సమాచారం. అయితే ప్రభుత్వ ప్రతిపాదనను సీజేపీ ప్రతినిధులు తిరస్కరించినట్లు తెలుస్తోంది. విద్యాశాఖ నుంచి బదిలీ చేయడం సమస్యకు పరిష్కారం కాదని, మంత్రి పదవి నుంచి పూర్తిగా తప్పుకోవడమే ప్రజలకు సరైన సందేశమని వారు స్పష్టం చేసినట్లు సమాచారం. ధర్మేంద్ర ప్రధాన్ ప్రభుత్వంలో కొనసాగితే ఉద్యమ లక్ష్యం నెరవేరదని, అందువల్ల రాజీనామా ఒక్కటే తమ డిమాండ్ అని చర్చల సందర్భంగా వెల్లడించినట్లు తెలిసింది.

**ఉద్యమకారుల్లో వ్యతిరేకత వస్తుందనే ఆందోళన**

చర్చల సందర్భంగా మంత్రివర్గంలో ఎవరు కొనసాగాలి? ఎవరికీ ఏ శాఖ కేటాయించాలన్నది పూర్తిగా ప్రధానమంత్రి అధికార పరిధిలోని అంశమని కేంద్ర ప్రతినిధులు సీజేపీకి వివరించినట్లు సమాచారం. అయినప్పటికీ, ఉద్యమకారులు తమ డిమాండ్‌లో ఎలాంటి మార్పు చేయడానికి సిద్ధంగా లేరని తెలుస్తోంది. శాఖ మార్పు కంటే మంత్రి పదవి నుంచి తప్పుకోవడమే మేలని వారు స్పష్టం చేసినట్లు సమాచారం. సీజేపీ చర్చల బృందం ప్రభుత్వ ప్రతిపాదనను అంగీకరిస్తే ఉద్యమంలో పాల్గొంటున్న విద్యార్థులు, మద్దతుదారుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమయ్యే అవకాశముందని వారు భావించినట్లు సమాచారం. అందుకే ఎలాంటి రాజీకి వెళ్లకుండా రాజీనామా డిమాండ్‌పైనే నిలబడినట్లు తెలుస్తోంది. ఉద్యమ లక్ష్యం నుంచి వెనక్కి తగ్గినట్లు సంకేతాలు వెళ్లకూడదనే ఉద్దేశంతో తమ వైఖరిని మార్చలేదని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

**రాజీనామా తర్వాత ముగిసిన ఆందోళన**

మూడో విడత చర్చలకు కొన్ని గంటల ముందే ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు. అనంతరం సీజేపీ తమ నిరసన కార్యక్రమాలను విరమిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో గత కొన్ని వారాలుగా కొనసాగిన ఆందోళనలకు తాత్కాలికంగా తెరపడింది. రాజీనామా అనంతరం కేంద్ర ప్రభుత్వం, సీజేపీ మధ్య ఉద్రిక్తతలు కూడా తగ్గుముఖం పట్టాయి.

**రాహుల్ గాంధీ కూడా అదే డిమాండ్**

ఈ వివాదం సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్? శాఖను మార్చే ప్రయత్నాలు కేంద్రం చేస్తోందని ప్రతిపక్షాలు కూడా విమర్శించాయి. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ధర్మేంద్ర ప్రధాన్ శాఖ మార్పు సరిపోదని స్పష్టం చేశారు. విద్యార్థుల ఆందోళనలకు న్యాయం జరగాలంటే మంత్రి పదవి నుంచి పూర్తిగా తప్పుకోవాల్సిందేనని ఆయన పలుమార్లు పేర్కొన్నారు. కేవలం శాఖను మార్చడం ద్వారా సమస్య ముగిసిపోదని, బాధ్యతను నిర్ధారించే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పరిణామాలన్నింటితో కేంద్ర ప్రభుత్వం తొలుత శాఖ మార్పు ద్వారా వివాదాన్ని చల్లార్చే ప్రయత్నం చేసింది. కానీ సీజేపీ మాత్రం పట్టుబట్టడంతో రాజీనామా తప్పలేదు.

# పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఎన్నికలు కపట నాటకం

పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో (గ్రాశీఖ) జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇవి ప్రజాస్వామ్య ఎన్నికలు కావని, పాకిస్థాన్ తన అక్రమ ఆక్రమణల్ని ప్రపంచం నుంచి దాచిపెట్టేందుకు, దృష్టి మరల్చేందుకు ఆడుతున్న కపట నాటకమని భారత్ ఎండగట్టింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ (వీజూ) అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మంగళవారం మీడియా సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం పాకిస్థాన్ ఆక్రమణలో ఉన్న ప్రాంతాలతో సహా జమ్మూకశ్మీర్, లద్దాఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలు మొత్తం భూభాగం భారతదేశంలో అంతర్భాగమేనని మరోసారి స్పష్టం చేశారు. ఈ విషయంలో భారత్ వైఖరి ఎప్పటికీ మారలేదని, అదే తమ విధానం అని పేర్కొన్నారు. పీఓకేలో ప్రజాస్వామ్యం అమలవుతోందనే భావన కల్పించడానికి మాత్రమే ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నారని అన్నారు. వాస్తవానికి ఆ ప్రాంతంలో పాకిస్థాన్ అక్రమ ఆక్రమణ కొనసాగుతోందని, అక్కడి ప్రజలపై తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ దారుణాల నుంచి ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నమే ఎన్నికల నిర్వహణ అని జైస్వాల్ విమర్శించారు.

'పాక్ ఆక్రమిత జమ్మూకశ్మీర్‌లో ఇటీవల పెద్ద ఎత్తున జరుగుతున్న నిరసనలు కూడా అక్కడి ప్రజల అసంతృప్తికి నిదర్శనం. పాకిస్థాన్ ఆర్థిక దోపిడీకి పాల్పడటం, ప్రజల ప్రాథమిక హక్కుల్ని కాలరాయడం, పరిపాలనా అణచివేత కారణంగానే ప్రజలు వీధుల్లోకి వస్తున్నారు. ఎన్నికల పేరుతో ఈ వాస్తవాల్ని ప్రపంచానికి కనిపించకుండా చేయాలని పాకిస్థాన్ ప్రయత్నిస్తోంది.'

**భారత నాగరిక వారసత్వంపై పాక్‌కు హక్కులేదు!**

ఈ సందర్భంగా మరోసారి సింధు జలాల ఒప్పందం అంశంపైనా స్పందించారు జైస్వాల్. ఉమ్మడి సింధు లోయ



నాగరికత తమది కూడా అని కొందరు పాకిస్థాన్ నిపుణులు చేస్తున్న వ్యాఖ్యల్ని ఆయన ఖండించారు. దశాబ్దాలుగా సరిహద్దు బయట ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, హింసకు మద్దతు ఇస్తున్న దేశానికి భారత నాగరిక, సాంస్కృతిక వారసత్వంపై హక్కు లేదని స్పష్టం చేశారు. గతేడాది ఏప్రిల్‌లో జరిగిన పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన తర్వాత భారత్, సింధు జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది.

దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల నిరసనలకు మద్దతుగా పాకిస్థాన్ నుంచి సోషల్ మీడియాలో వస్తున్న వీడియోలపైనా జైస్వాల్ స్పందించారు. పాకిస్థాన్ దశాబ్దాలుగా భారత్‌పై సరిహద్దు దాటి ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తుందని, ఆ దేశం వాస్తం స్వరూపం భారత యువతకు బాగా తెలుసని అన్నారు. భారత యువతతో పాటు కొత్త తరం కూడా పాకిస్థాన్ ప్రోత్సహిస్తున్న సరిహద్దు ఉగ్రవాదానికి పూర్తిగా ముగింపు పలకాలని కోరుకుంటోందని ఆయన చెప్పారు. పాకిస్థాన్ ప్రజలు, అక్కడి నాయకత్వం కూడా ఈ విషయాన్ని గుర్తుంచుకుంటే మంచిదని చురకలంటించారు.

**సార్క్ సహకారాన్ని అడ్డుకుంటుంది పాకిస్థానే!**

ఇదే సమయంలో దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంస్థ కార్యకలాపాలు నిలిచిపోవడానికి పాకిస్థానే ప్రధాన కారణమని భారత్ మరోసారి స్పష్టం చేసింది. ప్రాంతీయ సహకారాన్ని భారత్ ఎప్పటి నుంచో సమర్థిస్తోందని, అయితే సార్క్ ముందుకు సాగకుండా అడ్డుకుంటున్న దేశం ఏదో దక్షిణాసియాలోని ప్రతి ఒక్కరికీ తెలుసని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. మాల్దీవులు అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు ఇటీవల సార్క్‌ను తిరిగి చురుగ్గా మార్చాలని, సభ్య దేశాల మధ్య విభేదాల్ని చర్చల ద్వారా పరిష్కరించాలని చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ రణధీర్ జైస్వాల్ ఇలా అన్నారు. ప్రాంతీయ సహకారాన్ని బలోపేతం చేసేందుకు భారత్ దశాబ్దాలుగా నిరంతర కృషి అందిస్తోందన్నారు. సార్క్‌లో భారత్, అఫ్గానిస్థాన్, భూటాన్, బంగ్లాదేశ్, మాల్దీవులు, నేపాల్, పాకిస్థాన్, శ్రీలంక సభ్య దేశాలుగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఆర్థిక, సామాజిక, అభివృద్ధి సహకారాన్ని పెంచే లక్ష్యంతో ఈ సంస్థ పనిచేస్తుంది. 2014లో నేపాల్ రాజధాని కాఠ్‌మాండూలో జరిగిన సార్క్ శిఖరాగ్ర సమావేశం తర్వాత ఈ సంస్థ కార్యకలాపాలు పెద్దగా ముందుకు సాగలేదు. 2016లో పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరగాల్సిన సార్క్ సదస్సు కూడా రద్దయింది. ఆ ఏడాది సెప్టెంబరులో జమ్మూకశ్మీర్‌లోని ఉరీలో భారత సైనిక శిబిరంపై జరిగిన ఉగ్రదాడి అనంతరం భారత్ ఆ సమావేశానికి హాజరు కాలేమని ప్రకటించింది. తర్వాత బంగ్లాదేశ్, భూటాన్, అఫ్గానిస్థాన్ కూడా ఇస్లామాబాద్ సమావేశాన్ని బహిష్కరించడంతో సదస్సు పూర్తిగా రద్దయింది.

# ప్రహ్లాద్ జోషి రేపిస్టుల మద్దతుదారు

కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి రేపిస్టుల మద్దతుదారు అని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. అలాంటి వ్యక్తికి విద్యాశాఖ మంత్రి బాధ్యతలు కట్టబెట్టడం దారుణమన్నారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బిల్కిస్ బానో కేసులో శిక్షపడిన దోషులను ప్రహ్లాద్ జోషి వెనకేసుకొచ్చారని రాహుల్ తెలిపారు. అత్యాచార దోషులను సమర్థించే వ్యక్తి విద్యా శాఖ మంత్రిగా ఉండేందుకు ఎంత మాత్రం అర్హుడు కాదన్నారు.

"విద్యావ్యవస్థలోని లోపాలను ప్రశ్నిస్తూ యువత ఆందోళనలు చేపట్టారు. ఎంతో మంది యువతులు నిరసనల్లో పాల్గొన్నారు. కానీ, వారిని దారుణంగా కొట్టారు, చిత్రహింసలకు గురిచేశారు. బీజేపీ ఒక అత్యాచార దోషుల రక్షకుడిని మంత్రి కుర్చీలో కూర్చోబెట్టింది. అత్యాచార దోషులకు రక్షణ కల్పించాలనే వాడి కంటే నైతికత లేని వ్యక్తి మరొకరు ఉండరు. ఇప్పుడు అతనే దేశ విద్యాశాఖ మంత్రి. ఈ విషయంలో ప్రధాని స్పందన చాలా వింతగా ఉంది. ఆయన కేబినెట్‌లో ఎంతో మంది మంత్రులు ఉన్నారు. వారిలో ఎవరికైనా ఈ పదవికి అప్పగించిఉండొచ్చు. కానీ ఆయన మాత్రం అత్యాచార దోషులను కాపాడే వ్యక్తినే ఎంచుకున్నారు."



ఇదిలా ఉండగా, పేపర్ లీక్, ఇతర అక్రమాలకు వ్యతిరేకంగా పరీక్షా విధానంలో తీసుకొచ్చిన కఠినమైన చట్టాలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళల హక్కులు, మహిళా రిజర్వేషన్లు, మహిళా సాధికారత గురించి మాట్లాడుతుంటే, మరోవైపు ఇలాంటి వారిని మంత్రిని చేయడం సమాజంలో మహిళల భద్రతకు చాలా తప్పుడు సంకేతాలను పంపుతుందని ఆమె ఆరోపించారు. అయితే, లోక్?సభలో ప్రియాంక చేసిన వ్యాఖ్యలపై అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆమె చేసిన వ్యాఖ్యలకు తగిన ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. దీంతో సభలో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. ప్రహ్లాద్ జోషికి సంబంధించిన వీడియో తమ వద్ద ఉందని, తాను మాట్లాడిన ప్రతి మాటకూ కచ్చితమైన ఆధారాలు సమర్పిస్తానని ప్రియాంక స్పష్టం చేశారు.

**మన దేశ రాజ్యాంగం గొప్పది!**

అంతకుముందు, వేలాది మంది యువకులు తమ గళాన్ని వినిపించడానికి, ప్రభుత్వం నుంచి జవాబుదారీతనం కోరడానికి శాంతియుతంగా వీధుల్లోకి వచ్చారని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. విద్యార్థులు వ్యవస్థపై నమ్మకం కోల్పోతున్నారని, కష్టపడటం కంటే నిజాయతీగా ఉండకపోవడానికే ఎక్కువ ప్రాధాన్యం ఉందని భావించడం మొదలుపెట్టారని ఆమె ఆరోపించారు. "అన్నింటికన్నా మనకు ఈ దేశ రాజ్యాంగం గొప్పది, ప్రజాస్వామ్యమే సర్వోన్నతమైనది. దానిని నాశనం చేయడం పాపం. ఈ దేశంలోని కోట్లాది ప్రజలు మనల్ని కోరుకునేది ఒక్కటే, అదే జవాబుదారీతనం. మనకు అధికారం ఇచ్చి ఇక్కడికి వచ్చాక, మనం చేసే ప్రతి పని వారి సంక్షేమం కోసమే ఉండాలనేది వారి ఏకైక ఆకాంక్ష. ఒకవేళ వారికి అన్యాయం జరిగితే, మనం వారికి జవాబుదారీగా ఉండి, వారికి న్యాయం జరిగేలా చూడాలి. కానీ, అలా జరగనందువల్లే ఇటీవలి రోజుల్లో వేలాది మంది యువకులు వీధుల్లోకి వచ్చి తమ ఆవేదనను వ్యక్తం చేశారు" అని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు.


## జనసంద్రమైన సింహాచలం..

ఆంధ్రప్రదేశ్ లోని ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి గిరి ప్రదక్షిణ మహోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. సింహాద్రి అప్పన్న నామస్మరణతో గిరి ప్రదక్షిణ మార్గం మార్మోగిపోతోంది. ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఏటా నిర్వహించే ఈ మహోత్సవంలో పాల్గొనేందుకు లక్షలాదిగా తరలివచ్చిన భక్తులతో 32 కిలోమీటర్ల మార్గమంతా కిటకిటలాడుతోంది. కొండ దిగువన ఉన్న తొలిపావంచ వద్ద కొబ్బరికాయలు కొట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు పాదయాత్రను ప్రారంభించారు. ఈ ఏడాది 10 లక్షల మందికి పైగా భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం, దేవస్థానం అధికారులు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేశారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను డ్రోన్ల సహాయంతో పర్యవేక్షిస్తూ, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. పాదయాత్ర చేస్తున్న భక్తుల కోసం గిరి ప్రదక్షిణ మార్గంలో 33 చోట్ల వైద్య శిబిరాలు, 26 అంబులెన్స్‌లను అత్యవసర సేవల కోసం సిద్ధంగా ఉంచారు. గిరి ప్రదక్షిణ పూర్తి చేసుకున్న వారికి అప్పన్న ఉచిత దర్శన సౌకర్యం కల్పించారు. మార్గమధ్యంలో పలు స్వచ్ఛంద సంస్థలు, స్థానికులు భక్తులకు అల్పాహారం, తాగునీరు అందిస్తూ తమ భక్తిని చాటుకుంటున్నారు. 32 కిలోమీటర్ల పాదయాత్రను పూర్తి చేసుకుని భక్తులు బుధవారం ఉదయానికి స్వామివారి ఆలయానికి చేరుకుంటారు. ఆషాఢ పౌర్ణమి నాడు సింహాద్రి కొండ చుట్టూ ప్రదక్షిణ చేస్తే భూ ప్రదక్షిణ చేసినంత పుణ్యఫలం దక్కుతుందని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు.

## ఫేస్‌బుక్, గూగుల్, ఎక్స్‌లకు కేంద్రం సమన్లు

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల నియంత్రణ, వినియోగదారుల గోప్యత వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా మెటా (ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్), గూగుల్, ఎక్స్, స్నాప్‌చాట్ వంటి దిగ్గజ సంస్థలకు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమన్లు జారీ చేసింది. ఆగస్టు 3న నిర్వహించనున్న పార్లమెంటరీ కమిటీ సమావేశానికి హాజరై, సంబంధిత అంశాలపై వివరణ ఇవ్వాలని సోషల్ మీడియా ప్రతినిధులను ఆదేశించింది. కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్, బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సమావేశానికి టెక్ కంపెనీల ప్రతినిధులతో పాటు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మరియు హోం మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులు కూడా హాజరై కమిటీకి వివరాలు సమర్పిస్తారని ఆయన తెలిపారు. ప్రజల, ముఖ్యంగా మహిళలు, పిల్లలు, రైతుల సమాచార భద్రతకు తీసుకుంటున్న చర్యలతో పాటు, శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి భరోసా కల్పిస్తున్నారో వివరించాలని కంపెనీలను కోరినట్లు ఆయన పేర్కొన్నారు. ఇటీవల పరీక్ష పత్రాల లీకేజీ, సంస్కరణలపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడిన వీడియోను ఫేస్‌బుక్ కొద్దిసేపు తొలగించడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత సాంకేతిక లోపం వల్లే ఈ పొరపాటు జరిగిందని మెటా వివరణ ఇచ్చింది. ఈ వివాదం మరియు విద్యార్థుల నిరసనల నేపథ్యంలో సోషల్ మీడియా వినియోగంపై విస్తృత చర్చ జరుగుతున్న తరుణంలో పార్లమెంటరీ కమిటీ సమన్లు జారీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## కృత్రిమ సూర్యుడి దిశగా చైనా..



అపరిమితమైన, స్వచ్ఛమైన ఇంధనాన్ని సృష్టించే లక్ష్యంతో చేపట్టిన 'కృత్రిమ సూర్యుడు' ప్రాజెక్టులో చైనా మరో కీలక మైలురాయిని అధిగమించింది. అణు సంలీన రియాక్టర్ కోసం రూపొందించిన ప్రపంచంలోనే అతిపెద్ద సూపర్ కండక్టింగ్ మాగ్నెట్‌ను చైనా శాస్త్రవేత్తలు విజయవంతంగా పరీక్షించారు. భవిష్యత్తులో ఫ్యూజన్ ఎనర్జీని సాధించే దిశగా ఇది అత్యంత కీలకమైన ఇంజినీరింగ్ విజయమని నిపుణులు అభివర్ణిస్తున్నారు. చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ పరిధిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా ఫిజిక్స్ (ఏఎస్ఐపీపీ) శాస్త్రవేత్తలు ఈ ఘనత సాధించారు. స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన టోరాయిడల్ ఫీల్డ్ మాగ్నెట్, హై-టెంపరేచర్ సూపర్ కండక్టింగ్ సెంట్రల్ సోలనోయిడ్ కాయిల్ వ్యవస్థలు అన్ని పరీక్షల్లోనూ ఉత్తీర్ణత సాధించినట్లు వారు ప్రకటించారు. సుమారు 582 టన్నుల బరువున్న ఈ భారీ మాగ్నెట్‌ను 'డీ' ఆకారంలో నిర్మించారు. దీని తయారీకి అవసరమైన కీలక పదార్థాల నుంచి సాంకేతిక పరిజ్ఞానం వరకు అన్నింటినీ చైనా దేశీయంగానే సమకూర్చుకోవడం విశేషం. అణు సంలీన ప్రక్రియలో భాగంగా, సూర్యుడి కేంద్ర భాగం కంటే కొన్ని రెట్లు అధిక ఉష్ణోగ్రత కలిగిన ప్లాస్మాను సృష్టిస్తారు. ఈ అత్యధిక ఉష్ణోగ్రత రియాక్టర్ గోడలను తాకకుండా, శక్తిమంతమైన అయస్కాంత క్షేత్రంలో బంధించేందుకు ఈ భారీ మాగ్నెట్‌లు కీలక పాత్ర పోషిస్తాయి. హైడ్రోజన్ ఐసోటోప్‌లను సంలీనం చేయడం ద్వారా శక్తిని ఉత్పత్తి చేసే ఈ విధానం, భవిష్యత్తులో కర్బన రహిత విద్యుత్ ఉత్పత్తికి మార్గం సుగమం చేస్తుంది. ఈ ప్రయోగం విజయవంతమైనప్పటికీ, వాణిజ్య స్థాయిలో ఫ్యూజన్ విద్యుత్‌ను నిరంతరాయంగా ఉత్పత్తి చేయడం అంతర్జాతీయ శాస్త్రవేత్తలకు ఇప్పటికీ సవాలుగానే ఉంది. అయితే, తన ఇంధన మరియు సాంకేతిక లక్ష్యాల సాధనలో భాగంగా చైనా ఈ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతూ వేగంగా ముందుకు సాగుతోందని ఈ తాజా పరిణామం స్పష్టం చేస్తోంది.

## సైబర్ మోసాలకు పాల్పడితే మరణశిక్ష

ఆన్‌లైన్ మోసాలను (సైబర్ స్కామ్స్) అరికట్టే దిశగా మయన్మార్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలను బలవంతంగా హింసించి, ఆన్‌లైన్ మోసాలకు పాల్పడేలా చేస్తున్న నేరగాళ్లకు మరణశిక్ష విధించేలా రూపొందించిన కొత్త చట్టానికి ఆమోదం తెలిపింది. రాజధాని నైప్యిడాలో జరిగిన పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో 'యాంటీ-ఆన్‌లైన్ స్కామ్ బిల్లు'కు ఆమోదం లభించినట్లు స్పీకర్ ప్రకటించారు. ఈ నూతన చట్టం ప్రకారం, ఉద్యోగాల పేరుతో ప్రజలను కిడ్నాప్ చేసి, వేధింపులకు గురిచేస్తూ బలవంతంగా ఆన్‌లైన్ నేరాలకు పాల్పడేలా చేసే వారికి 10 ఏళ్ల నుంచి యావజ్జీవ కారాగార శిక్ష విధించే అవకాశం ఉంది. ఒకవేళ ఈ క్రమంలో బాధితులు ఎవరైనా మరణిస్తే, బాధ్యులైన నిందితులకు మరణశిక్ష విధించేందుకు ఈ చట్టం వీలు కల్పిస్తుంది. వీటితో పాటు స్కామ్ సెంటర్ల నిర్వాహకులకు, డిజిటల్ లేదా క్రిప్టోకరెన్సీ మోసాలకు పాల్పడే వారికి గరిష్ఠంగా యావజ్జీవ కారాగార శిక్ష పడేలా కఠిన నిబంధనలను పొందుపరిచారు. మయన్మార్‌లో నెలకొన్న అంతర్గత ఘర్షణలను ఆసరాగా చేసుకుని సైబర్ నేర కేంద్రాలు పుట్టగొడుగుల్లా విస్తరించాయి. ఆగ్నేయాసియా అంతటా విస్తరించిన ఈ నెట్‌వర్క్, పెట్టుబడులు, హనీ ట్రాప్ పేరుతో ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందిని లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతోంది. కొందరు స్వచ్ఛందంగానే ఈ ముఠాలలో చేరుతుండగా, మెజారిటీ విదేశీయులను ఆకర్షణీయమైన ఉద్యోగాల పేరుతో అక్రమంగా తరలించి, వారిని బందీలుగా మార్చి బలవంతంగా ఈ అరాచకాలకు ఒడిగడుతున్నారు. ఇటీవలి కాలంలో తెలుగు రాష్ట్రాల నుంచి కూడా ఎంతోమంది యువత ఉద్యోగాల వేటలో మయన్మార్ వెళ్లి, అక్కడ స్కామ్ కేంద్రాల్లో బందీలుగా చిక్కుకున్నట్లు అనేక ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో, సైబర్ నేరగాళ్ల ఆటకట్టించేందుకు ప్రస్తుత సైనిక మద్దతుగల ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ కఠిన చట్టం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

# నేరేడుచర్ల మండల తొలి సమీక్షా సమావేశం

**ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తం కావాలి -- ప్రత్యామ్నాయ పంటలే రైతులకు రక్షణ**

**జలసిరి పనులు వేగవంతం చేయాలి -- ప్రత్యేక అధికారి వి. మోహన్‌బాబు**

**డ్రిప్ సిస్టమ్‌కు 90 శాతం సబ్సిడీ.. రైతులు వినియోగించుకోవాలి: వ్యవసాయ అధికారి జావేద్**




**నేరేడుచర్ల, శుభోదయ డైనమిక్ వార్త,జూలై 28** నేరేడుచర్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల తొలి సమీక్షా సమావేశం ప్రత్యేక అధికారి వి. మోహన్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరై శాఖల వారీగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి వి. మోహన్‌బాబు మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి కార్యక్రమాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఎఐ+ =ూవీ+ జలసిరి పనులను గ్రామాల్లో వేగవంతం చేసి వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

**ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి**

సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి జావేద్ ఎల్‌నినో వాతావరణ పరిస్థితులపై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రస్తుతం సూపర్ ఎల్‌నినో ప్రభావం కారణంగా సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో రైతులు అధిక నీటి అవసరమయ్యే వరి సాగును తగ్గించి, తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని సూచించారు.

**మెట్ట పంటల సాగుతో నష్టాలను తగ్గించుకోవాలి**

వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు కందులు, జొన్నలు, శనగలు వంటి మెట్ట, ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. అలాగే తక్కువ నీటితో మంచి ఆదాయం అందించే ఆయిల్‌పామ్ తోటల సాగు కూడా లాభదాయకమని వివరించారు.

**డ్రిప్ సిస్టమ్‌కు 90 శాతం సబ్సిడీ**

నీటి వనరులను సమర్థంగా వినియోగించేందుకు డ్రిప్ ఇరిగేషన్ విధానం అత్యంత ఉపయోగకరమని పేర్కొన్న జావేద్, డ్రిప్ వ్యవస్థ ఏర్పాటుకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ అందిస్తోందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నీటి పొదుపుతో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు.

**జలసిరి పనుల పురోగతిపై సమీక్ష**

ఎఐ+ =ూవీ+ జలసిరి పథకం కింద ప్రతి గ్రామంలో చేపడుతున్న ఫామ్‌పాండ్లు, ఫిష్‌పాండ్లు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు, సోక్‌పిట్లు, పర్కొలేషన్ ట్యాంకులు, చెక్‌డ్యామ్‌లు, వర్షపు నీటి సంరక్షణ పనుల పురోగతిని సమావేశంలో సమీక్షించారు. పనులను వేగవంతంగా పూర్తి చేసి భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలని అధికారులకు సూచించారు.

**అన్ని శాఖల పనితీరుపై సమగ్ర సమీక్ష**

విద్యుత్, మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా, వ్యవసాయం, పశుసంవర్ధక, వైద్య ఆరోగ్యం, విద్య తదితర శాఖల ప్రగతిపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అందుతున్న సేవల్లో ఎలాంటి లోపాలు లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ప్రత్యేక అధికారి ఆదేశించారు. సమావేశంలో అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను సమర్పించి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ సోమ సుందర్ రెడ్డి, ఎంపీవో నాగరాజు,ఏపీ ఓ శేఖర్, వెట్నర్ డాక్టర్ నరేష్, పిహెచ్ సి డాక్టర్ నాగిని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు అధికారులు పాల్గొన్నారు

# లీగల్ నోటీసులతో సరి...





**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మధ్య సాగుతున్న ప్రత్యక్ష పోరు సరికొత్త మలుపులు తిరుగుతోంది. ఇంటర్మీడియట్ మార్కుల వివాదంతో ముడిపడిన గ్లోబ్‌ఎరీనా సంస్థ కేటీఆర్‌దేనని, అది ఆయన బినామీ కంపెనీ అని సీఎం రేవంత్ రెడ్డి చేసిన సంచలన ఆరోపణలపై కేటీఆర్ మరోసారి లీగల్ నోటీసు అస్త్రాన్ని ప్రయోగించారు. 48 గంటల్లో బేషరతుగా క్షమాపణ చెప్పకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అయితే, రేవంత్ రెడ్డి విసురుతున్న తీవ్రమైన రాజకీయ ఆరోపణలను కేటీఆర్ మైదానంలో రాజకీయంగా తిప్పికొట్టకుండా, పదే పదే న్యాయస్థానాలు ,లీగల్ నోటీసుల వెనుక దాక్కుంటున్నారనే చర్చ తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్రంగా సాగుతోంది.గతాన్ని పరిశీలిస్తే కేటీఆర్ ఈ తరహా లీగల్ రూట్‌ను ఎంచుకోవడం ఇదే మొదటిసారి కాదు. గతంలో పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి వైట్ ఛాలెంజ్ విసిరినప్పుడు , డ్రగ్స్ వ్యవహారంలో కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకున్నప్పుడు కూడా ఆయన రాజకీయ సభల్లో రేవంత్‌ను గట్టిగా దెబ్బతీయడం కంటే కోర్టుల్లో కేసులు వేయడానికే ప్రాధాన్యత ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్ వివాదం, బావమరిది ఫామ్‌హౌస్ రచ్చ, ఫార్ములా-ఈ రేస్ లీగల్ ప్రాసెస్, ఫోన్ ట్యాపింగ్ ఆరోపణల సమయంలోనూ పదుల సంఖ్యలో నాయకులకు లీగల్ నోటీసులు పంపారు. ఒక నాయకుడిగా తన ఇమేజ్‌ను కాపాడుకోవడానికి ఇది చట్టపరంగా సరైన మార్గమే అయినప్పటికీ, ప్రజాక్షేత్రంలో మాత్రం ఇది ఒక రకమైన రక్షణత్మక శైలి గా కనిపిస్తోంది.రాజకీయాల్లో ఆరోపణలు వచ్చినప్పుడు ప్రజా క్షేత్రంలోనే వాటిని ఖండించాలి. రేవంత్ రెడ్డి ప్రజాదరణ పొందిన మాస్ లీడర్ శైలిలో ఘాటైన భాషతో, మీడియా వేదికలపై బహిరంగ దాడి చేస్తుంటే, కేటీఆర్ కూడా తన పద్ధతిలో కౌంటర్ ఇస్తున్నపటికీ అదనంగా కార్పొరేట్ పద్ధతిలో లీగల్ నోటీసుల కాగితాలను ముందుకు తెస్తున్నారు. రేవంత్ చేసే ప్రతి ఆరోపణకు మైక్ ముందుకు వచ్చి గంటల తరబడి ఆధారాలతో కౌంటర్ ఇవ్వకుండా, కేవలం లీగల్ టీమ్‌తో నోటీసులు పంపడం వల్ల.. కేటీఆర్ దగ్గర రాజకీయంగా రేవంత్‌ను ఢీకొట్టే కంటెంట్ లేదా పవర్ లేదా అనే సందేహం సామాన్య ప్రజల్లోకి వెళ్తోంది. ప్రజాస్వామ్యంలో కోర్టు నోటీసుల కంటే ప్రజా కోర్టులోనే నిజానిజాలు తేలాలనేది మెజారిటీ ఓటర్ల భావన. ఈ లీగల్ నోటీసుల స్ట్రాటజీ వల్ల రేవంత్ రెడ్డికి రాజకీయంగా మరింత మేలు జరుగుతోందనేది రాజకీయ విశ్లేషకుల అంచనా. కేటీఆర్ నోటీస్ ఇవ్వగానే.. నేను దేనికైనా సిద్ధం, విచారణ జరిపిస్తాం అని రేవంత్ రెడ్డి ఆ ఆరోపణలను మరింత గట్టిగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ఫలితంగా, గ్లోబ్‌ఎరీనా లేదా ఇతర ఆరోపణలు మీడియాలో రోజుల తరబడి నానుతూ, కేటీఆర్‌కు ప్రతికూల ప్రచారంగా మారుతున్నాయి. ఒక రకంగా కేటీఆర్ పంపే నోటీసులే రేవంత్ రెడ్డి ఆరోపణలకు మరింత పబ్లిసిటీ తెచ్చిపెడుతున్నాయనే సత్యాన్ని బీఆర్ఎస్ వ్యూహకర్తలు గుర్తించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి.మాజీ మంత్రిగా, ఒక సమర్థవంతమైన పాలకుడిగా ఐటీ రంగాన్ని నడిపిన కేటీఆర్.. చట్టపరమైన ప్రక్రియల ద్వారా తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలనుకోవడం సాంకేతికంగా సరికావచ్చు. కానీ, తెలంగాణ వంటి హై-ఓల్టేజ్ రాజకీయాలు నడిచే రాష్ట్రంలో కార్పొరేట్ తరహా లీగల్ బెదిరింపులు పాలిటిక్స్‌లో పనిచేయవు. శత్రువు విసిరిన బాణాన్ని చట్టంతో కాకుండా, అంతకంటే పవర్ ఫుల్ పొలిటికల్ అస్త్రంతో తిప్పికొట్టినప్పుడే కేడర్‌లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. రేవంత్ రెడ్డి లేవనెత్తుతున్న ప్రతి అంశంపై సభలు, సమావేశాలు పెట్టి ఆధారాలతో ప్రజాక్షేత్రంలోనే ఎండగట్టకపోతే.. ఆయనకు రాజకీయంగా రేవంత్‌ను ఎదుర్కొనే సత్తా తగ్గుతోందనే ప్రచారం నిజమేనని ప్రజలు నమ్మే ప్రమాదం ఉందని ఎక్కువ మంది భావిస్తున్నారు.

# గ్రాస్ రూట్‌కు దూరంగా కవిత...

**హైదరాబాద్ :** మొగుడు కొట్టినందుకు కాదు తోటికోడలు నవ్వినందుకే నే ఏడుస్తున్నా" అనే నానుడి తెలంగాణ రాజకీయాల్లో అచ్చం సరిపోతుంది. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన విమర్శలు విన్నప్పుడు ప్రతి ఒక్కరికీ ఇదే నిజమనిపిస్తుంది. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్తు గురించి, లాభనష్టాల గురించి లోతుగా లెక్కలు వేసుకున్న తర్వాతే కేటీఆర్ విద్యార్థులతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. కానీ కవిత మాత్రం ఆ మాత్రం ధైర్యం కూడా చేయలేకపోయారు. దాదాపు నెలరోజులుగా ఢిల్లీలో విద్యార్థులు తీవ్రమైన ఆందోళనలు చేస్తున్నా, ఆ పోరాటాలు ఎంతో ఉద్రిక్తంగా మారినా ఆమె ఎప్పుడూ మొక్కుబడిగా స్పందించారే తప్ప విద్యార్థులకు నిజమైన అండగా నిలబడే ప్రయత్నం ఎన్నడూ చేయలేదుఢిల్లీలో విద్యార్థుల ఆందోళనలు పూర్తిగా ముగిసిన తర్వాత మీడియా ముందుకు వచ్చి తాపీగా మాట్లాడడం ఆమె వైఫల్యానికి నిదర్శనం. ఆ సమయంలో ఊరుకుంటే బాగుండేది కానీ ఆమె అనవసరమైన విమర్శలకు దిగారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ మంత్రులు విద్యార్థులతో కలిసి శనివారం సాయంత్రం భారీ ర్యాలీలో పాల్గొనడాన్ని ఆమె తీవ్రంగా తప్పుపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థుల విజయాన్ని స్వయంగా తన ఖాతాలో వేసుకున్నారని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వాన్ని కూడా విద్యార్థులు ఎక్కడ ప్రశ్నిస్తారో అనే భయంతోనే రేవంత్ రెడ్డి ఈ కొత్త నాటకాలు ఆడుతున్నారని ఆమె ఆరోపించారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి పోరాటాలు చేయకుండా కేవలం మాటలతో కాలక్షేపం చేసే నాయకులకు ఇటువంటి విమర్శలు చేయడం పరిపాటిగా మారింది.కాంగ్రెస్ పార్టీకి మొదట్నుంచీ విద్యార్థుల విషయంలో స్పష్టమైన వైఖరి ఉంది. ఆ పార్టీ ఎలాంటి ఉద్దేశ్యాలు కలిగి ఉన్నప్పటికీ ఈ ఆందోళనలకు బహిరంగంగానే తన సంఘీభావం తెలిపింది. పార్లమెంటు లోపల, బయట విద్యార్థుల తరపున గట్టిగా పోరాడింది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ముఖ్యమంత్రులు, మంత్రులు, ఆ పార్టీ సీనియర్ నేతలు అందరూ విద్యార్థులకు మద్దతుగా ఆందోళనలు నిర్వహించారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు కూడా ప్రత్యక్షంగా నిరసనల్లో పాల్గొన్నారు. కనుక విద్యార్థుల ఆందోళనలలో కాంగ్రెస్ పార్టీ కూడా ఒక భాగస్వామి అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కష్టకాలంలో విద్యార్థులకు అండగా ఉన్న పార్టీని ప్రశ్నించే నైతిక హక్కు కేవలం ప్రజలకోసం పోరాడే వారికే ఉంటుంది.ఈ సుదీర్ఘ ఆందోళనలకు పూర్తిగా దూరంగా ఉండిపోయిన కల్వకుంట్ల కవిత, విద్యార్థులకు ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ అండగా నిలబడిన కాంగ్రెస్ పార్టీని, సీఎం రేవంత్ రెడ్డిని ఆక్షేపించడం చూస్తే అసలు విషయం అర్థమవుతుంది. ఈ రాజకీయ క్రెడిట్ అంతా తనకు దక్కలేదు, కేవలం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీకి మాత్రమే దక్కిందనే తీవ్రమైన బాధతోనే ఆమె ఈవిధంగా మాట్లాడినట్లు స్పష్టంగా అనిపిస్తుంది. ప్రజల సమస్యల కంటే రాజకీయ లబ్ధి, క్రెడిట్ కోసమే బీఆర్ఎస్ నాయకులు పాకులాడుతున్నారనే విమర్శలకు ఈ ఘటన మరో ఉదాహరణగా నిలిచింది. కష్టపడి పనిచేసే వారికే ఫలితం దక్కుతుందనే కనీస సత్యాన్ని గ్రహించలేక కవిత ఇలాంటి విమర్శలు చేయడం ద్వారా తన రాజకీయ అపరిపక్వతను మరోసారి బయటపెట్టుకున్నారు.సొంత పార్టీ నాయకులు సైతం క్షేత్రస్థాయిలో ప్రజల్లో ఉంటుంటే, అధ్యక్షురాలి హోదాలో ఉన్న కవిత మాత్రం కేవలం మాటల గారడీకి పరిమితం కావడం తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. తమ వైఫల్యాలను కప్పిపుచ్చడానికి ఇతరులపై బురదజల్లే సంస్కృతిని బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా మార్చుకోవాలి.

## ఎల్‌నినో ప్రభావం: ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలి -- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట బ్యూరో, శుభోదయ డైనమిక్** ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. కోదాడ రైతు వేదికలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ, ఇప్పటికే పత్తి, కంది, పెసర, బొబ్బర పంటలు వేసిన రైతులు అంతర పంటలు సాగు చేయాలని తెలిపారు. కొర్రలు, సామలు, సజ్జలు, కూరగాయలు, ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం ఉంటుందని, బిందు సేద్య పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తుందని చెప్పారు. ఆయిల్ పామ్ సాగు స్థిరమైన ఆదాయాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలి: కలెక్టర్ బి. చంద్రశేఖర్




**నల్గొండ బ్యూరో , శుభోదయ డైనమిక్** మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న కందులు, ఆయిల్ పామ్, సజ్జలు, ఆవాలు, సోంపు తదితర పంటల సాగును రైతులు చేపట్టేలా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. వర్షపాతం తక్కువగా ఉండే అవకాశాల నేపథ్యంలో ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు.ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని, రైతు వేదికల్లో పంటల ఎంపికపై మార్గనిర్దేశం చేయాలని తెలిపారు. అలాగే ఎదీ+-=ూవీ+ కార్యక్రమంలో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహించి భూగర్భ జలాల పెరుగుదలకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామి వారికి పంచామృత అభిషేకాలు



**శుభోదయ డైనమిక్ న్యూస్ హుజూర్ నగర్:** హుజూర్నగర్ మండలం బూరుగడ్డ గ్రామంలో వేంచేసియున్న శ్రీ ఆది వరాహ లక్ష్మి నరసింహ వేణుగోపాల స్వామి దివ్య క్షేత్రములో క్షేత్రపాలకుడు శ్రీ ఆంజనేయ స్వామి" వారికి పంచామృత అభిషేకము, 108 తమల పాకులచే ఆకుపూజ, గంధ సింధూరము, పానకం, వడపప్పు, పండ్లు, నారికేళము, పులిహోర, వడమాల, ప్రసాద నివేదనలతో ప్రత్యేక పూలదండ అలంకరణ సహిత పూజా కార్యక్రమము ఉదయం 9-00 గంటలకు ఆలయ అర్చకులు హరీష్ కుమార్ ఆచార్యులు చే జరిగినవి. శాశ్వత ఆకు పూజకు ములుగు లింగం బాబు ధర్మపత్ని సత్యవతి దంపతులు మరియు కర్నాటి శ్రీనివాస్ పద్మావతి దంపతులు దేవులపల్లి అజయ్ ధర్మపత్ని అమితా దంపతులు సహకరించారు. ఈ కార్యక్రమంలో:- ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎంపీ లక్ష్మణరావు ఆలయ చైర్మన్ యరగాని బిక్షం గౌడ్, ధర్మకర్తలు:- యరగాని సతీష్. ప్రార్థన బోయిన గంగయ్య. గూడెపు నాగలింగం. అద్దంకి సంధ్య. పిట్టల గురవయ్య. కస్తల శంకర్. అర్చకులు హరీష్ కుమారా చార్యులు మరియు యరగాని గురవయ్య. నర్సయ్య. సురభి సైదులు. లక్ష్మిప్రసన్న. ప్రవళిక. రమ్య. అరుణ. మరియు ఆలయ సిబ్బందిలి వై కిరణ్ గౌడ్. వై రమేష్. వై ఉపేందర్. తదితరులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఓపెన్. ఇంటర్ అడ్మిషన్ల గడువు ఆగస్టు 15 వరకు పొడిగింపు

**నడి గూడెం, శుభోదయ డైనమిక్** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) 2026-27 విద్యా సంవత్సరానికి ఓపెన్ ూజ, ఓపెన్ ఇంటర్మీడియట్ ప్రవేశాల గడువును ఆగస్టు 15 వరకు పొడిగించింది. ఈ నెల 29 నుంచి ఆగస్టు 15 వరకు నిర్దేశిత రుసుముతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని టాస్ డైరెక్టర్ తెలిపారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 502 అడ్మిషన్లు

**అధ్యాపక బృందం సమిష్టి కృషికి ప్రిన్సిపాల్ అభినందనలు**




**శుభోదయ డైనమిక్ న్యూస్, జులై 28, సూర్యాపేట :** సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి మొదటి సంవత్సరం ప్రవేశాల్లో 502 అడ్మిషన్లు నమోదు కావడం హర్షణీయమని కళాశాల ప్రిన్సిపాల్ పెరుమాళ్ల యాదయ్య తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో నిర్వహించిన సమావేశంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు. అందరి సమిష్టి కృషి ఫలితంగానే 500కు పైగా అడ్మిషన్లు సాధ్యమయ్యాయని ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరింత మంది విద్యార్థులను కళాశాలలో చేర్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఇంకా ప్రవేశాలు కొనసాగుతున్నాయని, జూలై 31వ తేదీలోపు మొదటి సంవత్సరం అడ్మిషన్లు పొందేందుకు అవకాశం ఉందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## నేరేడుచర్లలో వనమహోత్సవం




**నేరేడుచర్ల,శుభోదయ డైనమిక్** నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని 7, 8 వార్డుల్లో మంగళవారం ఛైర్మన్ కొణతం వెంకటరెడ్డి అధ్యక్షతన వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా పలు రకాల మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కమిషనర్ చెన్నబోయిన నాగరాజు, వైస్ ఛైర్మన్ నూకల సందీప్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు, మార్కెట్ వైస్ ఛైర్మన్, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొని మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించడం ద్వారా పచ్చని పర్యావరణాన్ని భావితరాలకు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఇళ్లు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ స్థలాల్లో విస్తృతంగా మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని సూచించారు.

## ప్రకృతి పరిరక్షణ దినోత్సవం ఘనంగా నిర్వహణ



**నేరేడు చర్ల, శుభోదయ డైనమిక్** నేరేడుచర్ల: పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఎకో క్లబ్, "యంగ్ ఎర్త్ లీడర్స్" విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు బట్టు మధు మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, సహజ వనరుల సంరక్షణకు విద్యార్థులు ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం. సైదులు, రషీద్ ఖాన్, జానకి రాముడు, శౌరి, వెంకటేశ్వరరావు, నరసింహారావు, అన్నపూర్ణ, మాధవి, నాగమణి, ఎన్.వి. భానుమతి, జానయ్య, వెంకటరెడ్డి, బికోజి, పీడీ యాదగిరి, బాలు, శ్రీనివాసరావు, వినోద్, శ్రీకాంత్, వినీత, శ్రీను, పద్మ పాల్గొన్నారు.

## నేరేడుచర్లలో వ్యవసాయ కార్మికుల సర్వే




**నేరేడు చర్ల, శుభోదయ డైనమిక్** నేరేడుచర్ల మండలం ముకుందాపురం గ్రామ దళితవాడలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మికుల సర్వే నిర్వహించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు పోసనబోయిన హుస్సేన్, జిల్లా సహాయ కార్యదర్శి సిరికొండ శీను కూలీ కుటుంబాలను కలిసి వారి జీవన పరిస్థితులు, కూలి రేట్లు, ఉపాధి అవకాశాలు, సంక్షేమ పథకాల అమలుపై వివరాలు సేకరించారు.ఈ సందర్భంగా వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, నరేగా పనులు పెంచాలని, ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, పెన్షన్లు, ఆరోగ్య కార్డులు, రేషన్ కార్డుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్వే నివేదికను ప్రభుత్వానికి అందజేసి కార్మికుల హక్కుల కోసం ఉద్యమాలు కొనసాగిస్తామని నాయకులు తెలిపారు.

## నీట్ విద్యార్థులకు సీపీఐ నివాళి



**నేరేడుచర్ల, శుభోధయ డైనమిక్** నేరేడుచర్లలో సీపీఐ ఆధ్వర్యంలో నీట్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధూళిపాళ ధనుంజయ నాయుడు మాట్లాడుతూ, విద్యార్థుల మరణాలకు కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని విమర్శించారు. నీట్‌ను రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, మృతుల కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యమాల్లో పాల్గొన్న విద్యార్థులు, యువకులపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## సంఘ్ పరివార్ అనుబంధ సంస్థల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ నారపరాజు రామచంద్రరావు



**శుభోదయ డైనమిక్ న్యూస్ హుజూర్ నగర్** : హుజూర్ నగర్ పట్టణంలో నిర్వహించిన సంఘ్ పరివార్ అనుబంధ సంస్థల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ నారపరాజు రామచంద్రరావులిని లిహుజూర్ నగర్ బిజెపి పట్టణ అధ్యక్షులు కొంద హరీష్ గౌడ్ మరియు పట్టణ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. పట్టణ అధ్యక్షులు కొండా హరీష్ గౌడ్ తో పాటు బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చింతలపూడి ఉమామహేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు దేనుమకొండ రామరాజు, లీగల్ సెల్ నాయకులు పిడమర్తి చంద్రయ్య, మాడుగుల లక్ష్మీనారాయణ, ఇంటి రవి, గుండా గోపి, రాళ్ళబండి రామారావు, కంటు నాగరాజు, పైడిమర్రి విజయ్, చుక్క హరీష్, కొప్పెర సాయిరాం, బల్వంత్ సింగ్, వెంకమ్మ మరియు తదితర బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు వ్యవహారంపై శ్వేతపత్రం విడుదల చేయాలి: టీఆర్పీ




**సూర్యాపేట, జూలై 28 (శుభోదయ డైనమిక్):** ధాన్యం కొనుగోలు, బియ్యం సేకరణ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు మామిడి అంజయ్య డిమాండ్ చేశారు. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) నిర్వహణ, మిల్లర్లపై ఒత్తిళ్లు, ధాన్యం నిల్వల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని ఆయన విమర్శించారు. వట్టే జానయ్య యాదవ్‌పై వచ్చిన ఆరోపణలను ఖండిస్తూ, అవసరమైతే అన్ని అంశాలపై వివరణ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## బీవోసీ కార్డులు సకాలంలో రెన్యూవల్ చేయించుకోండి: గురవయ్య



**హుజూర్‌నగర్, శుభోదయ డైనమిక్** భవన నిర్మాణ కార్మికులు బీవోసీ (దీూజఔ) కార్డులను సకాలంలో రెన్యూవల్ చేయించుకోవాలని ఐఎన్‌టీయూసీ హుజూర్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్య గౌడ్ సూచించారు. బైక్ ప్రమాదంలో గాయపడిన పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు రాచకొండ రామును పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. బీవోసీ కార్డు రెన్యూవల్ లేకపోవడంతో ప్రభుత్వ ఇన్సూరెన్స్ ప్రయోజనాలు అందలేదని పేర్కొన్నారు. ప్రమాదాల సమయంలో కార్మిక కుటుంబాలు నష్టపోకుండా ఉండాలంటే కార్డులను తప్పనిసరిగా గడువులోపు రెన్యూవల్ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మేళ్లచేరువు ముక్కంటి, జిల్లా నాయకులు చింతకాయల రాము, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్రకు పిలుపు



**శుభోదయ డైనమిక్ , చిలుకూరు** గీత కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరుతూ ఆగస్టు 2 నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో "అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్ర" నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు తెలిపారు. చిలుకూరులో వాల్ పోస్టర్ ఆవిష్కరణ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గీత కార్మికుల పెన్షన్, ఎక్స్‌గ్రేషియా పెంపు, కాటమయ్య రక్షణ కవచం, నీరా పరిశ్రమల ఏర్పాటు వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 5న కోదాడ నియోజకవర్గంలో యాత్ర నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబు తెలిపారు. గీత కార్మికులు, ప్రజాసంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: మోతె ఎస్ఐ లచ్చిరెడ్డి



**శుభోదయ డైనమిక్ న్యూస్ మోతె, జూలై 28:**పర్యావరణ పరిరక్షణలో భాగంగా మోతే పోలీస్ స్టేషన్ ఎస్ఐ లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మోతే గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోతే గ్రామ పరిసరాల్లో పలు రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎస్ఐ. లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కల పెంపకం ద్వారా పచ్చదనం పెరగడంతో పాటు పర్యావరణ సమతుల్యత కాపాడబడుతుందని తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మల్లయ్య గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారుపాల్గొన్నారు.

## వి బి జి రామ్ జి పనులను పరిశీలించిన ఎంపీడీవో సందీప్




**మోతె, శుభోదయ డైనమిక్** మోతేమండలంలోని గ్రామపంచాయతీలో విబిజి రాంజీలో జరుగుతున్న హరిత వనమోత్సవ చెట్లు నాటుతున్న పని ప్రదేశాన్ని ఎంపీడీవో సందీప్ కుమార్ సందర్శించారు ఇక్కడ జరుగుతున్న కూలీలతో ఎంపీడీవో సందీప్ కుమార్ చెట్లను సరైన క్రమంలో కూలీలతో మొక్కలు నటించాలని రక్షణకు వాచరు ను నియమించాలని ఫీల్డ్ అసిస్టెంట్ పని ప్రదేశంలో ఉండి మొక్కలు సరైన క్రమంలో నాటే విధంగా చూసుకోవాలని ఆదేశించారు ఫీల్డ్ అసిస్టెంట్ పని ప్రదేశంలో లేకుంటే కఠినమైన చర్యలు తీసుకుంటానని అదేవిధంగా కూలీలు తమ పొలంలో ఫారం పాండు ను నిర్మించుకోవాలని మరియు ఇంకుడు గుంతలను ప్రతి ఇంటిలో తీపించుకోవాలని కూలీలకు సూచించారు ఇట్టి కార్యక్రమంలో ఈసీ శ్రీహరి పంచాయతీ కార్యదర్శి మరియు ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు

## సీజనల్ పరిస్థితులు, జలసిరి తదితర అంశాలపై మండలస్థాయి సమీక్ష సమావేశం



**మునగాల, జూలై 28 (శుభోదయ డైనమిక్ న్యూస్)** మునగాల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రమేష్ దీన్ దయాల్ అధ్యక్షతన మండలస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీజనల్ సందిగ్ధత (ఎల్ నినో) ప్రభావం, వీబీజీ రాంజీ (జలసిరి) కార్యక్రమం, అలాగే వివిధ ప్రభుత్వ శాఖల పనితీరు, అమలులో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు.

జిల్లా పరిషత్ సీఈవో శిరీష, డిప్యూటీ సీఈవో మహాలక్ష్మి మాట్లాడుతూ ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, జలసిరి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. అలాగే గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రమేష్ దీన్ దయాల్, ఎంపీఓ నరేష్, పీఏసీఎస్ చైర్మన్లు కందిబండ సత్యనారాయణ, తొగరు సీతారాములు, రామిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం...!



**శుభోదయ డైనమిక్ న్యూస్ మఠంపల్లి** : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం, గ్రామపంచాయతీ నందు ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం జరుపుకున్నా రు. ఈ సందర్భంగా మఠంపల్లిలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ యేసుమల్ల వీరలక్ష్మి పాపయ్య, వారితోపాటు ఉప సర్పంచ్ కొత్తపల్లి శౌరి ఏపీఓ ఉమా, ఏ ఈ ఓ శ్రావ్యాంజలి త్రివేణి గ్రామ సెక్రెటరీ వెంకటేశ్వర్లు జోసు ఏ సుమల రాములు వీరబాబు మల్లారావు పోలీస్ డిపార్ట్మెంట్ మరియు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

EDITOR & PUBLISHER : PARVATHAM PARAMESH, PLACE OF PUBLICATION : 4-68, LAL LAXMI PURAM, KALLURU, MEDARAM NEREDCHARLA RAOD, SURYAPET,TELANGANA - 508218.
PRINTER : LAXMI NARAYANA KARNATI, RATNA GRAPHICS, PRINTING PRESS (NAME & ADDRESS) 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPPOSITE POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013. TGTEL/26/A2416, SHUBODHAYA DYNAMIC VAARTA